చలివేంద్రం ప్రారంభం



రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ నాయకుడు సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు మోండా డివిజన్‌లోని 5 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు అల్లాడి గౌరిశంకర్, బాబురావు ముదిరాజ్, నందికంటి రవి, కేక్ శ్రీను, రౌతు రాజయ్య పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో కోట నీలిమా తదితరులు

సనత్‌నగర్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా అన్నారు. అశోక్‌కాలనీలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వమత సమ్మేళనానికి తెలంగాణ నిలయమన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నేతలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

బన్సీలాల్‌పేట్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గాంధీనగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం.. బోయిగూడ ఆల్‌ఫత్తా హోటల్ వద్ద అండికోలు జగదీశ్ (23) అలియాస్ జాగు వద్ద గంజాయి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు నిందితుడిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. జల్సాలకు అలవాటు పడిన జగదీశ్ సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మహారాష్ట్రకు చెందిన వైజనాథ్ వద్ద గంజాయి తీసుకువచ్చి నగరంలోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు జగదీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పూటకో మాట మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య'

హిమాయత్‌నగర్: 42 శాతం బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యత బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తీసుకోవాలని, లేదంటే బీజేపీకి రాజీనామా చేయాలని పలు బీసీ విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తదితరులు మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా బీసీ నేతగా, బీసీ ఉద్యమాలు చేస్తున్నానని చెప్పుకుంటూ అగ్ర కుల ప్రభుత్వాలతో కొట్లాడకుండా బీసీ ఉద్యమలను తాకట్టుపెట్టి వ్యక్తిగతంగా పదవులు పొందిన ఘనత బీజేపీ నాయకుడు ఆర్.కృష్ణయ్యకే దక్కిందన్నారు. పార్టీ మారుతూ పూటకో మాట మాట్లాడుతున్న కృష్ణయ్య బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ సబ్బండ కులాలతో కలిసి నగరంలో బీసీ దర్బార్ ఏర్పాటు చేసి కృష్ణయ్య చీకటి రాజకీయాలను వివరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోల్ నరేష్ ప్రజాపతి, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ గంగపుత్ర, నాయకులు నాగరాజుగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళను మోసగించిన వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: మహిళను మోసగించిన ఓ వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాకకు చెందిన మహిళ (31) భర్త చనిపోయాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరు వ్యాపారి రితేష్ జైస్వాల్ (37) ఆమెతో ఏడాదిన్నర పాటు సహజీవనం చేశాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మూడు రోజుల క్రితం మహిళ విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేశారు. నిందితుడు రితేష్ జైస్వాల్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయ భవనం | పనులకు మోక్షమెప్పుడో..?

రెండేళ్లుగా నిలిచిన తార్నాక లైబ్రరీ నిర్మాణం

- 2022లో రూ 84 లక్షలతో పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

లాలాపేట: తార్నాక గ్రంథాలయ భవనం పనులకు గ్రహణం పట్టింది. ప్రభుత్వం మారగానే అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొందని పాఠకులు, ప్రజలు వాపోతున్నారు.

ప్రస్తుతం తార్నాక లైబ్రరీ విజయపురికాలనీలోని (బతుకమ్మకుంట) మీసేవ సెంటర్ అద్దె భవనంలో కొనసాగుతోంది. అయితే రెండేళ్ల క్రితం నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తార్నాక స్ట్రీట్ నంబర్-11 కిమితి కాలనీలోని 244 చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో దాదాపు రూ. 84 లక్షల వ్యయంతో జీ ప్లస్- 1 పద్ధతిలో శాశ్వత భవనం నిర్మాణానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత, అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శంకుస్థాపన చేశారు.

2022 లో పనులు ప్రారంభం..

2022 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నూతనంగా దాదాపు 12 గ్రంథాలయ భవనాల నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో తార్నాక ఒకటి. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో గ్రంథాలయ భవనం సైతం నిలిచిపోయాయి. దీంతో పోటీ పరీక్షలకు హాజరయ్యే పేద, మధ్యతరగతి అభ్యర్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి నిలిచిపోతుందా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి బీఆర్‌ఎస్ డిప్యూటీ మేయర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రంథాలయ భవనం పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పాఠకులు, ప్రజలు కోరుతున్నారు.



తార్నాకలో నిలిచిన గ్రంథాలయ భవనం పనులు

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

రసూల్‌పురా: బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షర్ మిషన్ సహకారంతో కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు పరిధిలోని బాలంరాయి, కార్ఖాన, మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలల్లోని 600 మంది విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎన్. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, వార్డు అధ్యక్షులు అరుణ్, మధు, హరి, అసెంబ్లీ కన్వీనర్ వినోదా, అనురాధా, విజయలక్ష్మి, రేఖ, సబితా, వనిత, స్వాతి, నందిని, మహేశ్వరి, కామిని, సంగీతా, ఓంప్రకాశ్, ప్రవీణ్, చంద్రశేఖర్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న భానుక నర్మద తదితరులు

టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలను అడ్డుకోవాలని ఫిర్యాదు

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలు అడ్డుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ కోరారు. ఈ మేరకు చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ)ని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇందుకు చైన్‌మెన్లు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముందుగా చైన్‌మన్లపై చర్యలు తీసుకోవాలనిచ, అలాగే జీహెచ్‌ఎంసీ పరిధిలో న్యాక్ ఇంజినీర్ల వ్యవస్థను కూడా పూర్తిగా తొలగించాలన్నారు. సీసీపీ కూడా సానుకూలంగా స్పందించారని నవీన్‌కుమార్ తెలిపారు.



చీఫ్ సిటీ ప్లానర్‌కు ఫిర్యాదు చేస్తున్న నవీన్‌కుమార్ మాదిగ

వనాల పెంపుతోనే మానవ మనుగడ

సనత్‌నగర్: వనాల పెంపుతోనే మానవ మనుగడ సాధ్యమని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అన్నారు. జెకెకాలనీ ఎస్‌వీఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ సెంట్రల్ స్ట్రీట్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి మంగళవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఉద్యమంలా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జెకెకాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు, ఎస్‌వీఎస్‌ఎస్ నివాస్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, కోశాధికారి సంపత్, కాలనీ ప్రతినిధులు వెంకట్ సోమ, లక్ష్మారెడ్డి, రాంసుబ్బారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాషా, నాయకులు బాల్‌రెడ్డి, సరాఫ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జెకెకాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 37, పచ్చకాకర 40, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

బన్సీలాల్‌పేట్: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సికింద్రాబాద్ విద్యుత్ శాఖ డీఈ సీహెచ్ బ్రహ్మానందం పేర్కొన్నారు. పద్మారావునగర్‌లోని కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని ఆయా సెక్షన్ల పరిధిలోని ఏఈలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే తమ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా ఓ వాహనం, సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్ద మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మల్కాజిగిరి రైల్వేస్టేషన్ 2 నంబర్ ప్లాట్‌ఫాం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి వెళ్లి పరీక్షించగా అనారోగ్యంతో అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్ల వరకు ఉంటుందని ఎలాంటి వివరాలు లభించలేదు. మృతుడి వివరాలు తెలిసినవారు 94400 83160 నంబర్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

కృత్రిమ కాలు వితరణ



వితరణ చేసిన ఆర్టిఫిషియల్ లెగ్‌ను చూపిస్తున్న రవిప్రకాశ్

సనత్‌నగర్: బేగంపేటకు చెందిన కొరె రవిప్రకాశ్ రోజువారీ కూలీ. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాలును కోల్పోయి నడవలేకుండా ఉన్నాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్టిఫిషియల్ లెగ్‌ను అమర్చుకుంటే తనకు తాను పనులు చేసుకోవచ్చని డాక్టర్లు సూచించారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో అమర్చుకోలేని స్థితిలో ఉన్నామని కుటుంబ సభ్యులు బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి కృత్రిమ కాలు తయారు చేయించి రవిప్రకాశ్‌కు వితరణ చేశారు. ఈ మేరకు వెల్లాల రామ్మోహన్‌కు బాధితుడు, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సీఎంపై వ్యాఖ్యలు తగవు



ఏసీపీ జైపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ, బీఆర్‌ఎస్వీ నేతలు

బౌద్ధనగర్: మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ, బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు యాద క్రాంతి పేర్కొన్నారు. వారాసిగూడలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ.. బండి సంజయ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే బీఆర్‌ఎస్వీ నేతలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలగూడ : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. జీహెచ్‌ఎంసీ డీఈ సువర్ణ, ఏఈ కౌశిక్‌తో కలిసి అన్నానగర్‌లో మంగళవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నాలా పూడికతీత పనులు చేపడతామన్నారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని నాలలో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. లోప్రెషర్, కలుషిత జలాలు, వీధిదీపాలు, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ ప్రతినిధులు లక్ష్మి, శ్రీకాంత్, సాయిలు పాల్గొన్నారు.



అన్నానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ, జీహెచ్‌ఎంసీ అధికారులు

వ్యభిచార గృహంపై దాడి

రసూల్‌పురా: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలితో పాటు విటుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో మహిళను ప్రతిమా హోంకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కార్ఖాన కాకాగూడ సాయిరెసిడెన్సీ ఫ్లాట్‌నంబర్-105లో ఉగాండాకు చెందిన నాగియ షకీరా (31), ఆన్‌లైన్‌లో విటులను ఆకర్షించి ఉగాండాకు చెందిన కొబుసింగ్యే ఏంజెల్లా (28)తో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం చేయిస్తోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో కార్ఖాన పోలీసుల సహకారంతో సోమవారం రాత్రి దాడి చేసి నగరానికి చెందిన విటుడు డి. దినేశ్, నిర్వాహకురాలు నాగియ షకీరాను అరెస్టు చేసి బాధితురాలు ఏంజెల్లాను ప్రతిమా హోంకు తరలించారు. నిందితుల నుంచి ట్యాబ్, ల్యాప్‌టాప్, కండోమ్‌లు, రెండు పాస్‌పోర్ట్‌లు, రూ. 1850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యం

తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రణాళికతో ముందడుగు వేద్దామని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హైదర్‌గూడలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో లాల్‌దర్వాజా ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని అన్ని రంగాల్లో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి లాల్‌దర్వాజా ప్రాంతంలోని ముదిరాజ్‌ల సమస్యలపై చర్చించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో లాల్‌దర్వాజా ముదిరాజ్ నేతలు విజయ్ కుమార్, జగదీష్, సుధాకర్, ధర్మవీర్, సదా, అనిల్ కుమార్, సురేందర్, సతీష్, కైలాష్, నవీన్, పోసాని అశ్విన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్

వివాహిత అదృశ్యం



ముత్యం స్వర్ణ

అడ్డగుట్ట: వివాహిత అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నాగరాణి తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలోని వినోభానగర్‌కు చెందిన ముత్యం స్వర్ణ (25) ముత్యం రాజుకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈనెల 6న మధ్యాహ్నం 2 గంటలకు స్వర్ణ పుట్టింటికీ వెళ్తున్నానని చెప్పి జనగాంకు బయలుదేరింది. కాగా అదేరోజు సాయంత్రం 5 గంటలకు తన భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే తన మామ శ్రీశైలంకు ఫోన్ చేయగా స్వర్ణ ఇంటికి రాలేదని చెప్పాడు. దీంతో తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో మంగళవారం రాజు లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులనే తప్పుదోవ పట్టించి.. దొరికారు

- ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణ

కంటోన్మెంట్: పనిచేసిన సంస్థ సొమ్ము కాజేసి, పోలీసులనే తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన ఇద్దరు నిందితులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అరుణ్ కుమార్ బెహ్రా (32) బోయిన్‌పల్లిలోని నేతాజీనగర్‌లో నివాసముంటూ, సికింద్రాబాద్‌లోని గ్లోబల్ అడ్‌సార్వెంట్స్ సంస్థలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఆ సంస్థ మేనేజర్ బిక్రమ్ బెహ్రా సూచనల మేరకు కొంపల్లిలో ఉండే అసిస్టెంట్ మేనేజర్ సత్యపాండాకు అందజేసేందుకు ఈనెల 22న రూ.5 లక్షల నగదుతో బయలుదేరాడు. సమరేంద్ర దాస్ అనే వ్యక్తితో కలిసి ఈ సొమ్మును కాజేసిన అరుణ్ కుమార్ బెహ్రా పోలీసు వేషంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు కట్టుకథ అల్లాడు. పైగా బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు. అయితే అరుణ్‌కుమార్ బెహ్రా పొంతన లేని సమాధానాలతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకున్నాడు. కాజేసిన సొమ్మును సమరేంద్ర నివాసంలో పెట్టినట్లు చెప్పగా పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. సొమ్ము కాజేయడంతో పాటు పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు అరుణ్ కుమార్ బెహ్రాతో పాటు సమరేంద్రపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

మరో నకిలీ ఫిర్యాదు..

బోయిన్‌పల్లిలోని సునయన అపార్ట్‌మెంట్‌లో నివాసముండే సల్లు శ్రీనివాస్ సైతం ఇదే తరహాలో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 1న తన ఇంట్లో చోరీ జరిగి 3 తులాల బంగారు నగలు, రూ.3 లక్షల నగదు, స్మార్ట్ వాచ్ ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే విచారణలో శ్రీనివాస్ ఇంట్లో చోరీ జరగలేదని తేలింది. దీంతో పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చి, విలువైన సమయం, ప్రజాధనం వృథాకు పాల్పడిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన సోహేల్ అహ్మద్ (38) సైదాబాద్‌లో ఉంటూ రైళ్లలో సమోసాలు, టిఫిన్స్, వాటర్ బాటిల్స్ అమ్ముతుంటాడు. సోమవారం సికింద్రాబాద్ నుంచి మలక్‌పేటకు రైల్లో ప్రయాణిస్తుండగా నింబోలిఅడ్డ వద్ద కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంగీత్ కూడలి ఫుట్‌పాత్ వద్ద నిలిచిన వాహనాలు



రైల్వే ఆఫీసర్స్ అతిథిగృహం వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను మించి నిర్మించిన ఫుట్‌పాత్

అవసరమున్న చోట కాకుండా..

- అనవసరమైన చోట్ల అధిక విస్తీర్ణంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రధాన రహదారుల్లో ఇరుకుగాఫ్రీ లెఫ్ట్‌ల రోడ్లు
- లష్కర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై విస్మయం

సికింద్రాబాద్: లష్కర్ జీహెచ్‌ఎంసీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో నిర్మించిన పలు ఫుట్‌పాట్లు ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్నాయి. ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉండే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రధాన రహదారుల్లోనూ లేనంతగా సంగీత్ కూడలిలో విశాలమైన ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అసలే ఈరోడ్డు ఫుట్‌పాత్‌ల మీదుగా నడిచేవారి సంఖ్య తక్కువ. అయినప్పటికీ రహదారికి సమాంతరంగా భారీ ఫుట్‌పాత్‌లు నిర్మించి, కూర్చునేందుకు కుర్చీలు సైతం ఏర్పాటు చేశారు. అవి కాస్తా నిరుపయోగంగా మారడంతో పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

కుచించుకుపోయిన ఫ్రీ లెఫ్ట్‌లు..

సికింద్రాబాద్ సెయింట్ జాన్స్ కూడలి నుంచి సంగీత్ కూడలి మీదుగా రైల్ నిలయం మార్గంలో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన పలు అభివృద్ధి పనులతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ఓ రైల్వే భవనం అడ్డుగా ఉంది. దీనిని తొలగించే విషయంలోనూ జీహెచ్‌ఎంసీ, రైల్వే అధికారుల మధ్య సయోధ్య కుదరడం లేదు. దీనికితోడు విశాలమైన ఫుట్‌పాత్‌లు సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. భారీ ఫుట్‌పాత్ నిర్మాణంతో రైల్ నిలయం వైపు వెళ్లాల్సిన వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇక్కడ ఫ్రీ లెఫ్ట్ ఉన్నప్పటికీ ఫుట్‌పాత్ నిర్మాణంతో ఫ్రీలెఫ్ట్ మార్గం ఇరుకుగా మారింది. దీంతో కూడలి నుంచి రైల్వేస్టేషన్ వైపు రెడ్ సిగ్నల్ పడినపుడల్లా ఫ్రీ లెఫ్ట్ కూడా వాహనాల బారులు తీరడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రైల్ నిలయం నుంచి రైల్వే ఆఫీసర్స్ క్లబ్ మీదుగా రైల్వేస్టేషన్ వైపు వెళ్లే మూల మలుపులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఫ్రీ లెఫ్ట్ మార్గం కంటే ఫుట్‌పాత్ నిర్మాణం ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించడం గమనార్హం.



నిరుపయోగంగా ఫుట్‌పాత్‌పై కుర్చీలు

పలుమార్లు ఫిర్యాదులు చేసినా..

ఇక్కడ ఫుట్‌పాత్‌ల నిర్మించే సమయంలోనే పలువురు స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అవసరానికి మించి ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతాయని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోలేదు. పైగా సంగీత్ కూడలి రైల్‌నిలయం వెళ్లే మలుపులో నిర్మించిన విశాలమైన ఫుట్‌పాత్‌పై పాదచారులు కూర్చునేందుకు సిమెంట్ కుర్చీలు సైతం ఏర్పాటు చేశారు. సంగీత్ కూడలి నుంచి రైల్ నిలయం వెళ్లే మార్గాల్లో నిర్మించిన ఫుట్‌పాత్‌ల విస్తీర్ణాన్ని ఇరువైపులా కనీసం 3 నుంచి 4 ఫీట్ల మేర తగ్గిస్తే ఫ్రీ లెఫ్ట్ మార్గాల వెడల్పు పెరిగి వాహనాలు సాఫీగా వెళ్లే అవకాశం ఉంటుందని వాహనదారులు, స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.